# బనకచర్ల ప్రాజెక్టును తక్షణమే ఆపాలి

- కేంద్రం ఆదేశాలు జారీ చేయాలి
- ఆంధ్రప్రదేశ్‌పై ప్రేమ చూపినా మాపై మాత్రం వివక్ష చూపొద్దు
- ఇక్కడి కేంద్ర మంత్రులు స్పందించాలి
- నికరజలాలు ఎత్తుకెళ్లేలా కుట్రలు
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు
- రాజకీయ అక్కసుతో కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ విషప్రచారం
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఫైర్
- అపెక్స్ కౌన్సిల్‌లో చర్చ జరగాలి : సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- కేసీఆర్ పాలనలో ఆగిన రైతు ఆత్మహత్యలు: శ్రీధర్ దేశ్‌పాండే



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తదితరులు

చిక్కడపల్లి, జూన్ 22: 'గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టును తక్షణమే ఆపాలి.. దీని కోసం కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆదేశాలు జారీచేయాలి.. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వంపై కేంద్రానికి ప్రేమ ఉండొచ్చు.. కానీ, తెలంగాణ ప్రాంతంపై వివక్ష చూపొద్దు.. తెలంగాణకు చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులకు ఈ ప్రాంత నీళ్లగోస పట్టదా? తెలంగాణ గొంతెండుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదు? వారు వెంటనే స్పందించాలి' అని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ సోషల్ ఫౌండేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఫౌండేషన్ చైర్మన్ ఒంటెద్దు నర్సింహారెడ్డి అధ్యక్షతన 'తెలంగాణ జలవనరులు-వ్యవసాయం-నాడు, నేడు, రేపు' అన్న అంశంపై జరిగిన ఈ సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సాగునీటి రంగనిపుణులు శ్రీధర్‌రావు దేశ్‌పాండే, ప్రముఖ పాత్రికేయులు పరాంకుశం వేణుగోపాలస్వామి, తెలంగాణ గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్, విశ్రాంత ఇంజినీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి తన్నీరు వెంకటేశం, తెలంగాణ కల్లుగీత కార్పొరేషన్ పూర్వ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, ముక్యాల రవీందర్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు.

### కాళేశ్వరంపై విషప్రచారం

సమైక్య రాష్ట్రంలో నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను నిర్మించడానికి రెండు దశాబ్దాలు పట్టిందని, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి 40 ఏండ్లు పట్టిందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ మూడున్నరేండ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చారని తెలిపారు. అద్భుతమైన ప్రాజెక్టును ఆయన కట్టి చూపితే ఆంధ్ర మీడియా, కొందరు నాయకులు విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ అక్కసుతో, కుసంస్కారంతో కాళేశ్వరాన్ని తప్పుబడుతున్నారని ఆరోపించారు. దెబ్బతిన్న మూడు పిల్లర్లను మరమ్మతు చేయకుండా ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం కేవలం ఆంధ్రకు మేలు చేసేలా వ్యవహరిస్తున్నదని, తెలంగాణ ప్రజలు కూడా పన్నులు కడుతున్నారనే విషయాన్ని మరువొద్దని కోరారు. టీఎంసీ, క్యూసెక్, ప్రాజెక్ట్ అంటే తెలియని వాళ్లు కాళేశ్వరం గురించి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాజెక్టు కోసం ప్రతిపాదనలు పంపగానే కేంద్రం అనుమతి ఇస్తుందని, తెలంగాణలో కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతున్నదని మండిపడ్డారు. తెలంగాణలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులకు ఈ ప్రాంత నీళ్ల గోస పట్టదా? అని నిలదీశారు. తెలంగాణ గొంతెండుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఏపీ మీద ప్రేమ ఉండొచ్చు, కానీ తెలంగాణ ఆగం అవుతుంటే పట్టించుకోరా? అని ప్రశ్నించారు. 90 శాతం పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై ఇప్పటికీ సమీక్ష చెయ్యలేదని, పూర్తి చేసేందుకు కనీస ప్రయత్నమూ చేయడం లేదని మండిపడ్డారు.

### నికరజలాల కోసం ఏపీ కుట్రలు: జాన్‌వెస్లీ

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా నికరజలాలను తరలించుకుపోయేందుకు ఏపీ కుట్రలు చేస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ధ్వజమెత్తారు. నీళ్ల వాటాలు సాధించే పోరాటంలో కచ్చితంగా తమ పార్టీ మద్దతు ఉంటుందని ప్రకటించారు. రెండు రాష్ట్రాల సీఎంలు మాట్లాడుకోవడం వల్ల ప్రయోజనం ఉండదని, అన్నిరంగాల వ్యక్తులతో చర్చించాలని డిమాండ్ చేశారు. బనకచర్లపై అపెక్స్ కౌన్సిల్‌లోనూ చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఏపీలో తమ సొంత కూటమి ప్రభుత్వం ఉన్నదనే ఆ రాష్ట్రానికి కేంద్రం లాభం చేకూరుస్తున్నదని విమర్శించారు.

### రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానాలు ఇవే..

1. బనకచర్ల లింకు ప్రాజెక్టును కేంద్రం తక్షణమే ఆపాలి.
2. తెలంగాణ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా రాసిన లేఖలను ఏపీ సీఎం చంద్రబాబు ఉపసంహరించుకోవాలి.
3. కేంద్రం తక్షణమే రెండు రాష్ట్రాల నీటి వాటాల పంపిణీని పూర్తిచేయాలి
4. మేడిగడ్డ బరాజ్ ఏడో బ్లాక్‌లో రెండు పిల్లర్లకు వెంటనే మరమ్మతు చేపట్టాలి.
5. రైతుల ఆత్మహత్యలను నివారించి బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి.
6. కోతలు లేని విద్యుత్తును సరఫరా చేయాలి.
7. రైతాంగంపై అక్రమ అరెస్టులు, అక్రమ కేసులను ఖండిస్తున్నాం.
8. కేంద్రం వెంటనే తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలి.
9. పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు బదులుగా విశ్రాంత ఇంజినీర్లు రూపొందించిన పోలవరం, శ్రీశైలం, కృష్ణా నది మార్గం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించాలి. దానిని కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలి.
10. కృష్ణా, గోదావరి అవార్డుల ప్రకారం గోదావరి నీటి తరలింపునకు బదులు కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోసం ప్రభుత్వం డిమాండ్ చేయాలి.
11. గోదావరి జలాల్లో 968 టీఎంసీలకు అదనంగా వరద జలాల్లో 1,950 టీఎంసీలు వినియోగానికి డిమాండ్ చేయాలి.
12. కృష్ణా ట్రైబ్యునల్ ముందుంచిన 763 టీఎంసీల నీటివాటా కోసం న్యాయపోరాటం కొనసాగించాలి.
13. తెలంగాణ ముఖ్యమంత్రి మాట్లాడిన 1,000 టీఎంసీలు 500 టీఎంసీల ప్రకటనను ఉపసంహరించుకోవాలి.
14. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్రం జాతీయహోదాను ప్రకటించే వరకు ఉద్యమించాలి.

### తెలంగాణ వచ్చాకే తగ్గిన రైతుల ఆత్మహత్యలు: శ్రీధర్‌రావు దేశ్‌పాండే

తెలంగాణ వచ్చాకే తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలో రైతు ఆత్మహత్యలు తగ్గాయని సాగునీటి రంగ నిపుణుడు శ్రీధర్‌రావు దేశ్‌పాండే చెప్పారు. సీఎంగా కేసీఆర్ విప్లవాత్మక నిర్ణయాల వల్లే రైతు ఆత్మహత్యలు ఆగిపోయాయి తెలిపారు. 26వేల చెరువులు మిషన్ కాకతీయ ద్వారా అభివృద్ధి చేయడంతో భూగర్భజలాలు పెరగడంతో పాటు మత్స్య సంపద పెరిగిందని తెలిపారు. 3 కోట్ల టన్నుల చేప ఉత్పత్తి పెరిగిందని, 5 మీటర్ల వరకు గ్రౌండ్ వాటర్ పెరిగిందని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విషప్రచారం జరుగుతుందని, అందుకే తాను రెండు పుస్తకాలను తీసుకొచ్చినట్టు చెప్పారు. ప్రజలు వాస్తవాలను తెలుసుకోవాలని హితవు పలికారు. బనకచర్లపై కేసీఆర్ ఒప్పుకున్నారంటూ కూడా విషప్రచారం జరుగుతుందని ధ్వజమెత్తారు. తెలంగాణ ఏ ప్రాజెక్టు చేపట్టినా నాడు చంద్రబాబు కేంద్రానికి లేఖలు రాసి అడ్డుకున్నారని, అపెక్స్ కౌన్సిల్‌లోనూ అనుమతి రాకుండా అడ్డుతగిలారని గుర్తుచేశారు. బనకచర్ల ప్రాజెక్టు కోసం అపెక్స్ కౌన్సిల్ నుంచి ఎందుకు అనుమతి తీసుకోలేదని ప్రశ్నించారు. వరదజలాల తరలింపుపై ఏపీ ప్రాంతానికే కాదని, అందరికీ హక్కు ఉంటుందని వివరించారు. నీటి లెక్కలన్నీ కేసీఆర్‌కు తెలుసని, సముద్రంలో కలిసే 3000 టీఎంసీల నీటిలో 1950 టీఎంసీలపై చర్చ జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

# సుప్రీంకోర్టుకు వెళ్లరెందుకు?

మొదటిపేజీ తరువాయి...

కేంద్రంలోని బీజేపీ గోదావరి బేసిన్‌లో 'విభజన' విధానాన్ని అమలు చేస్తున్నది. గోదావరి బేసిన్‌తో ఏమాత్రం సంబంధం లేని తమిళనాడుకు జలాలను తన్నుకుపోవడంపై బేసిన్ రాష్ట్రాలన్నీ ఒంటి కాలు మీద లేవాల్సినప్పటికీ మోదీ ప్రభుత్వం ఒక్కో రాష్ట్రాన్ని ఒకో తీరుగా నోరు మూయిస్తున్నారు. ప్రధానంగా బేసిన్ రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి ప్రయోజనాలు అందిస్తున్నారనేది దేశం ముందు అందరికీ కనిపిస్తున్నది. కాకపోతే తెలంగాణ నోట్లో మట్టి కొడుతున్నారని తెలిసినా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడం వెనక ఎలాంటి ప్రయోజనం' ఉన్నదనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

### నోరెత్తకుండా సహకారం

గోదావరి- కావేరి లింక్ కోసం బీజేపీ సమాఖ్య స్ఫూర్తిని విస్మరించి ముందుకుపోతున్నది. ఈ అంశం తెరపైకొచ్చి ఏడాదిన్నర కావస్తున్నా రేవంత్‌రెడ్డి సర్కారు కించిత్తు మాట మాట్లాడటం లేదు. పైగా లింక్ ప్రాజెక్టుకు మార్గం సుగమయయ్యేలా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై నీటిపారుదలశాఖ వర్గాలు సైతం విస్మయం వ్యక్తంచేస్తున్నాయి. కేంద్రం కావేరి వ్యూహం స్పష్టంగా కనిపిస్తున్నా రాష్ట్ర సర్కారు స్పందన తీరు అనుమానాలకు తావిస్తున్నదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ఇప్పటికే సుప్రీంకోర్టు తలుపు తట్టాల్సింది పోయి అఖిలపక్షాన్ని ఎంపీలకే పరిమితం చేసి, ఇతర పక్షాలు లేకుండా ఢిల్లీకి వెళ్లడం అనుమానాలకు బలం చేకూరుస్తున్నది. రేవంత్ సర్కారు మౌనం వల్లే కేంద్రం సులువుగా బేసిన్‌లోని మిగిలిన రాష్ట్రాలను దారికి తెచ్చే ప్రక్రియను దిగ్విజయంగా పూర్తి చేసిందని సీనియర్ ఇంజినీర్ ఒకరు చెప్పారు. అసలు బేసిన్‌తో సంబంధంలేని తమిళనాడుకు నీటిని తరలిస్తున్నందున బేసిన్‌లోని రాష్ట్రాలన్నీ ఏకతాటిపైకి రావాల్సి ఉన్నదని, ఇందుకు గత ట్రిబ్యునళ్లు, అనేక ఉదాహరణలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఓవైపు గళం వినిపిస్తూనే మరోవైపు బేసిన్‌లోని ఇతర రాష్ట్రాలను కలుపుకొని కొట్లాడాల్సిన అవసరం ఉన్నది. అదేమీ లేకపోవడంతో బీజేపీ నిరాటంకంగా తన ప్రణాళికను అమలు చేస్తున్నది.

### ఒక్కో రాష్ట్రానికి ఒక్కో రీతిన..

గోదావరి బేసిన్‌లో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పాండిచ్చేరి ఉన్నాయి. కావేరికి జలాలు తరలిస్తే ప్రధానంగా నష్టం జరిగేది మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకే. అందుకే మోదీ సర్కారు తెలంగాణ మినహా మిగిలిన రాష్ట్రాలకు ప్రాజెక్టుల విషయంలో పూర్తి సహకారం అందించి ఆయా రాష్ట్రాల నోరు మూయించే ప్రయత్నం చేస్తున్నది.

### ఎందుకు కిమ్మనరు?

ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణ, ఏపీ కృష్ణా, గోదావరి బేసిన్‌లో ఏదైనా కొత్త ప్రాజెక్టు చేపట్టాలంటే కేంద్ర జలశక్తి మంత్రి చైర్మన్‌గా, ఇరు రాష్ట్రాల సీఎంలు సభ్యులుగా ఉండే అపెక్స్ కౌన్సిల్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ చట్టాన్ని తుంగలో తొక్కి జీబీ లింక్ ప్రాజెక్టును ఏపీ దూకుడుగా ముందుకు తీసుకుపోతుండగా, ఆర్థిక సాయం చేసేందుకు కేంద్రం మద్దతు తెలిపింది. తెలంగాణ అభ్యంతరాలను ఏమాత్రం పట్టించుకోకుండానే ఏపీ పీఎఫ్ఆర్ (పాజెక్టు ఫిజిబులిటీ రిపోర్టు), డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించడం, తొలిదశ పర్యావరణ అనుమతులకు కేంద్ర పర్యావరణశాఖ సూత్రప్రాయ అంగీకారం తెలపడం చకచకా జరిగిపోయింది. నెలాఖరున బనకచర్ల ప్రాజెక్టు టెండర్లు పిలిచేందుకు ఏపీ సన్నాహాలు చేస్తున్నది. అయినా రేవంత్ కిమ్మనడం లేదు! గతంలో సుప్రీంకోర్టు తీర్పుతోనే బ్రిజేష్ ట్రిబ్యునల్ అవార్డు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నది. రాయలసీమ లిఫ్ట్ పనులకు బ్రేక్ పడింది. తెలంగాణకు సంబంధించి గౌరవెల్లి, సీతమ్మసాగర్ పనులూ నిలిచిపోయాయి. అలాంటి అవకాశమున్నా జీబీ లింక్‌ను నిలువరించేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు కోర్టును ఆశ్రయించడం లేదు. కనీసం అపెక్స్ కౌన్సిల్‌లో చర్చకు పెడితే ఇరు రాష్ట్రాల అభిప్రాయాలతో కేంద్రమూ తన అభిప్రాయాన్ని తెలుపాల్సి ఉంటుంది. మినిట్స్‌లో రికార్డవుతాయి. అయినా జీబీ లింక్‌పై అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని రేవంత్‌రెడ్డి కనీసం డిమాండ్ చేయడం లేదు. విభజన చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘించినా కోర్టును ఆశ్రయించడం లేదు.

### చెరిసగం ఎంపీలున్నా తెలంగాణ ఎడారి..

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి ఇట్లా ఉంటే.. ఎనిమిది మంది ఎంపీలను ఇచ్చినా తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే తమకేం పట్టనట్టుగా రాష్ట్ర బీజేపీ నేతలు వ్యవహరిస్తుండటం విస్తుగొలుపుతున్నది. కొన్నిరోజుల కిందట బనకచర్లపై కేంద్రం ఆచితూచి వ్యవహరిస్తుందని, డీపీఆర్‌కు అనుమతే ఇవ్వలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మీడియా సమావేశంలో చెప్పారు. కానీ ఆపై కేంద్రం ఏకంగా అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ టీవోఆర్‌ను ఖరారు చేసింది. పైగా చంద్రబాబు పదేపదే మీడియా ముందుకు వచ్చి బనకచర్లను చేపడుతున్నట్టు అధికారికంగా ప్రకటిస్తున్నారు. అయినా తెలంగాణ బీజేపీ ఎంపీలు మాత్రం నోరు మెదపడం లేదు. గత 11 ఏండ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధుల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తూనే వస్తున్నది.. అయినా ఏనాడూ బీజేపీ నేతలు మాట్లాడిన దాఖలాలు లేవని రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు. తెలంగాణ ఏకంగా 8 ఎంపీ సీట్లిచ్చినా కనీసం ఒక్కటంటే ఒక్క కొత్త ప్రాజెక్టునూ తీసుకురాలేదని, ఇక బనకచర్ల ద్వారా కావేరికి తెలంగాణ గోదావరి జలాలను తన్నుకుపోతుంటే ఇక్కడి బీజేపీ ఎంపీలు అడ్డుకుంటారనుకోవడం అత్యాశేనని పెదవి విరుస్తున్నారు.

### ముమ్ముందు ఇబ్బంది లేకుండా కుట్ర

భవిష్యత్తులోనూ గోదావరి-కావేరి, బనకచర్లకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కేంద్రం, ఏపీ కుట్ర చేస్తున్నది. ఇందులో భాగంగానే ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబు అథారిటీ ఏర్పాటు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలతో సంబంధం లేకుండా ఏపీ-తెలంగాణ మధ్యే అథారిటీ ఏర్పాటు చేసి.. ఏదో ఒక సాకుతో తమిళనాడును జోడించాలనే ప్రణాళిక సిద్ధమవుతున్నట్టు తెలిసింది. కృష్ణా బేసిన్‌లోనూ తెలుగు గంగ ప్రాజెక్టు కింద ఏపీ-తెలంగాణతో పాటు తమిళనాడు కూడా చెన్నై నీటి కోసం భాగస్వామిగా ఉన్నది. ఇట్లనే ఈ అంశాన్ని తెలుగు రాష్ట్రాలకే పరిమితం చేసి అందులో తమిళనాడుకు అధికారిక పాత్ర ఇస్తే పోతిరెడ్డిపాడులా బనకచర్ల కోసం ఆంధ్రప్రదేశ్ తెలంగాణ నోరు కొట్టడం.. తద్వారా తమిళనాడుకు జలాలను తరలించుకుపోవడమనేది ఈ ప్రణాళిక సారాంశంగా ఒక సీనియర్ ఇంజినీర్ విశ్లేషించారు.

# లండన్ టూర్‌పై ఆనందగా ఉన్నా

- కేసీఆర్ పాలన గురించి చెప్పడంపై సంతోషం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, జూన్ 22 (నమస్తే తెలంగాణ): లండన్ టూర్ ఆనందమయంగా సాగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు దశాబ్దకాలంపాటు సాగిన కేసీఆర్ స్ఫూర్తిదాయక పాలనను ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరం సదస్సులో వివరించడం ఆనందంగా ఉన్నట్టు ఆదివారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

### సంధ్యగారూ.. త్వరగా కోలుకోండి

కాలికి గాయమై దవాఖానలో చికిత్స పొందుతున్న పీవోడబ్ల్యూ సంధ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. 'మీరు ఒక యోధురాలు. మీరు కోలుకున్న తర్వాత అదే ఉత్సాహంతో మీ ప్రయాణాన్ని కొనసాగిస్తారని నాకు నమ్మకం ఉంది' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఒక నిరసన కార్యక్రమంలో నాయకురాలు సంధ్యను పోలీసులు అమానుషంగా తరలించే క్రమంలో ఆమె కాలికి ఫ్రాక్చర్ అయినట్టు తెలుస్తున్నది.



చేగూర్ టెక్స్‌టైల్స్ పార్కు ఎదుట ధర్నా చేస్తున్న బాధిత రైతులు, పలువురు బోర్డు సభ్యులు

# టెక్స్‌టైల్స్ పార్కు ఎదుట రైతుల ఆందోళన

- తమ భూములివ్వాలని డిమాండ్
- ప్లాట్లు కేటాయించాలని టెక్స్‌టైల్స్ పార్కు బోర్డు సభ్యుల నిరసన

నందిగామ, జూన్ 22 : టెక్స్‌టైల్స్ పార్కు పేరిట సేకరించిన భూములను తిరిగి తమకే అప్పగించాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చేగూరులో రైతులు ఆందోళనకు దిగారు. టెక్స్‌టైల్స్ పార్కు బోర్డు సభ్యులు కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు. నందిగామ మండలం చేగూరు రెవెన్యూ పరిధిలో 2003లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటు చేస్తామని చెప్పి కొందరు వ్యక్తులు చుట్టుపక్కల గ్రామాల రైతుల నుంచి సుమారు 140 ఎకరాల పట్టా భూములను తక్కువ ధరకు కొనుగోలు చేశారు. భూములను సేకరించే సమయంలో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పడంతో భూములు ఇచ్చినట్టు బాధిత రైతులు పేర్కొంటున్నారు. ఏండ్లు గడిచినా టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటుచేయలేదని, ఉద్యోగాలు ఇవ్వలేదని, తమ భూములు తమకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- సరైన దిగుబడులు రాక.. అప్పులు తీర్చలేక మనస్తాపంతో..
- జనగామ, హనుమకొండలో ఘటనలు

జనగామ రూరల్, జూన్ 22 : అప్పుల బాధతో మరో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. దిగుబడులు రాక.. అప్పులు తీర్చలేక తీవ్రమనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడ్డారు. జనగామ మండలం శామీర్‌పేటకు చెందిన రైతు చాపల భాస్కర్(41) తనకున్న ఎకరం సాగు చేసుకుంటున్నాడు. పంట పెట్టుబడి, ఇద్దరు కూతుళ్ల పెండ్లికి రూ.8 లక్షలు అప్పులయ్యాయి. వాటిని తీర్చడానికి రెండెకరాలు కౌలుకు తీసుకున్నాడు. అప్పు ఇచ్చినవారు డబ్బులు చెల్లించాలని ఇంటికి రావడంతో మనస్తాపంతో భాస్కర్ ఆదివారం బావి వద్ద ఉరేసుకున్నాడు. హనుమకొండ జిల్లా గూడూరుకు చెందిన రైతు కుమ్మరి ప్రతాప్ (42) 2.20 ఎకరాల భూమిలో వరి సాగు చేశాడు. రెండేండ్లుగా దిగుబడులు రాక రూ.12 లక్షలు అప్పులయ్యాయి. వాటిని ఎలా తీర్చాలో తెలియక బెంగపెట్టుకున్నాడు. ఈ నెల 21న పొలం వద్ద గడ్డి మందు తాగాడు. వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

# రైతు మోసకారి.. రేవంత్ సర్కార్

- వానకాలం సీజన్ రైతు భరోసా కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమే
- పోలీస్ ఇన్వెస్టింగ్ అధికారిగా మాట్లాడుతున్న పీసీసీ చీఫ్
- బాల్కొండ ఎమ్మెల్యే వేముల



కంఠేశ్వర్, జూన్ 22: రైతు మోసకారి రేవంత్ సర్కార్ అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ ప్రభుత్వం ఓట్ల సమయంలో నామమాత్రంగా పథకాలు అమలు చేస్తూ .. ఓట్లు లేని సమయంలో ఎగ్గొడుతూ రైతులను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. రైతులకు నేరుగా నగదు బదిలీ పథకం కేసీఆర్ మొట్టమొదటిసారిగా రైతు బంధు ప్రారంభించారని గుర్తుచేశారు. రైతు నాట్లువేసే సమయంలోనే ప్రతి పంటకు రైతు బంధు ఇచ్చే వారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటికీ నుంచి ఇప్పటివరకు నాలుగు పంటలు రాగా మొదటి పంట సమయంలో ఎంపీ ఎన్నికలు రావడంతో ఓట్ల కోసం మ్యానిఫెస్టోలో చెప్పినవిధంగా రైతుభరోసా రూ.15వేలు కాకుండా కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన పాత రైతుబంధు పథకాన్నే అమలు చేశారని గుర్తుచేశారు. రెండో పంట సమయంలో ఎన్నికలు లేకపోవడంతో రైతు బంధు ఎగ్గొట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మూడోసారి కూడా ఎన్నికలు లేకపోవడంతో కొంతమందికే ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు నాలుగోసారి పంట సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు ముందుండటంతో ఓట్ల కోసం మభ్యపెట్టడానికి రైతుభరోసా ఇస్తున్నారని ఆరోపించారు.

### బీఆర్ఎస్ ఒత్తిడితోనే రుణమాఫీ..

మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రకారం రూ.రెండు లక్షల రుణమాఫీ చేయకపోగా.. ఎంపీ ఎన్నికల సమయంలో ఊరూరా తిరుగుతూ కనిపించిన ప్రతి దేవుడిపై ఒట్టు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. ఎంపీ ఎన్నికలు పూర్తవగానే కాలయాపన చేస్తూ .. చివరికి బీఆర్ఎస్ ఒత్తిడికి తట్టుకోలేక సగం మందికి రుణమాఫీ చేశారని తెలిపారు. ఐదెకరాలున్న సగం మందికి రైతుభరోసా ఎగ్గొట్టిందని చెప్పారు.

### విత్తనాలకు రాయితీ ఇవ్వని కాంగ్రెస్..

బీఆర్ఎస్ ప్రభుత్వంలో జీలుగ ధర రూ.1,150 ఉండగా ప్రస్తుత ప్రభుత్వం రూ.2,140కి పెంచిందని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులకు రాయితీపై విత్తనాలు ఇచ్చేదని.. ప్రస్తుతం ఏ విత్తనం కూడా రాయితీపై ఇవ్వడం లేదని చెప్పారు. మూడు దఫాలుగా ఎగ్గొట్టిన వడ్ల బోనస్, రైతు భరోసా, రుణమాఫీ బకాయిలు ఇచ్చాకనే.. స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడగడానికి రావాలని, లేనిపక్షంలో ప్రజలు తరిమికొడుతారని హెచ్చరించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పోలీస్ ఇన్వెస్టింగ్ అధికారిగా.. కేటీఆర్‌ను జైలుకు పంపడమే లక్ష్యంగా మాట్లాడుతున్నారని, ప్రతిపక్ష నాయకులను జైల్లో పెట్టే కార్యక్రమాలు ఎక్కువ రోజులు సాగవని తెలిపారు. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి ఫోన్‌ట్యాపింగ్ కేసు విచారణలో ఉండగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దారుణమని మండిపడ్డారు. విద్వేషపూరిత రాజకీయాలు మానుకోనిపక్షంలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటే అని, అందుకే బీజేపీ ఎంపీలు ఉన్న చోట మంత్రి పదవులు ఇవ్వడంలేదని వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు.

# చంద్రబాబు రూపంలో మరో జలదోపిడీ

- నాడు ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణాను మళ్లించిన వైఎస్
- నేడు అన్యాయం జరుగుతున్నా నోరుమెదపని రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ మరో ఉద్యమం చేయాల్సిందే : జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట, జూన్ 22 (నమస్తేతెలంగాణ) : ఏపీ సీఎం చంద్రబాబు రూపంలో మరోసారి తెలంగాణ జల దోపిడీకి గురవుతున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృష్ణానది నీటిని దోచుకుపోతే నేడు చంద్రబాబు గోదావరి నీటిని దోచుకుంటున్నాడని ధ్వజమెత్తారు. బనకచర్ల ప్రాజెక్టుకు వత్తాసు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం ఆయన సూర్యాపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, తెలుగుదేశం రెండూ తెలంగాణకు ద్రోహం చేసిన పార్టీలేనని, ఆ రెండు పార్టీల కలయికతో పుట్టిన హైబ్రిడ్ కలుపు మొక్క రేవంత్‌రెడ్డి అని పేర్కొన్నారు. అలాంటి వ్యక్తి తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉండటం మన దురదృష్టమని అన్నారు. తెలంగాణను ఊడగొట్టి ఆంధ్రాలో కలిపింది.. నాడు వందలాది మందిని బలిగొన్నది కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణను సాధించే క్రమంలో నాడు అడ్డుపడ్డది కూడా చంద్రబాబేనని తెలిపారు. తెలంగాణలో వలసలు, కరువు కాటకాలు, ఆకలి చావులకు కారణమైంది టీడీపీ, కాంగ్రెస్ పార్టీలేనని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు మళ్లీ కరువు కోరల్లో చిక్కుకునేలా రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. నదులు ఎక్కడున్నాయో తెలియని రేవంత్‌రెడ్డి ఇక్కడ దేనినైనా అమ్మేందుకు వెనుకాడటం లేదని విమర్శించారు. 350 టీఎంసీల ప్రాజెక్టు కట్టి రాజశేఖర్‌రెడ్డి దుర్మార్గంగా కృష్ణానది నీటిని తీసుకుపోతుంటే నాటి కాంగ్రెస్, టీడీపీ నాయకులు నోరు మెదపలేదని విమర్శించారు. నేడు గోదావరి నీటిని కూడా దోచుకుపోతుంటే రేవంత్‌రెడ్డి సీఎంగా ఉండి నోరు మెదపలేని దుస్థితిలో ఉన్నాడని మండిపడ్డారు. తన పదవిని కాపాడుకోవడం కోసం రేవంత్‌రెడ్డి తెలంగాణ మొత్తం దోచుకుపోయినా స్పందించడని పేర్కొన్నారు. ఈ దారుణాన్ని బీఆర్ఎస్ సహించదని, కేసీఆర్ మరో ఉద్యమం చేస్తే తప్ప జల దోపిడీని ఆపలేమని స్పష్టం చేశారు.

# పరిహారం ఇవ్వరు.. పంటవేయనివ్వరు!

- మామునూరు విమానాశ్రయానికి 245 ఎకరాల భూసేకరణ
- ఎకరానికి 1.20 కోట్ల నష్టపరిహారం చెల్లిస్తామన్న ప్రభుత్వం
- ఒక్క రూపాయి ఇవ్వకుండా.. పంటలు సాగుచేయవద్దని రైతులకు అధికారుల ఆదేశాలు
- సర్కారు తీరుపై రైతుల్లో ఆగ్రహం



విమానాశ్రయం విస్తరణ కోసం సర్వే చేసిన భూమిలో రైతులు సాగు చేస్తున్న పత్తి పంట

ఖిలా వరంగల్/కరీమాబాద్, జూన్ 22 : మామునూర్ విమానాశ్రయ పునరుద్ధరణ చర్యల జాప్యంతో బాధిత రైతు గుండెల్లో 'విమానం'మోత మోగుతున్నది. మామునూరు విమానాశ్రయాన్ని తామే పునరుద్ధరిస్తున్నామని, ఇది తమ ఘనతేనని గొప్పలు చెప్పుకొంటున్న కాంగ్రెస్ సర్కార్ భూసేకరణ లాంఛనాలు పూర్తిచేయకుండానే పంట లేసుకోవద్దని రైతులకు హుకూం జారీ చేసింది. దీంతో 'అమ్మ పెట్టదూ.. అడుక్కోనివ్వదు' అన్నట్టు సర్కార్ వ్యవహరిస్తున్నదని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం డబ్బులు చెల్లించాకే భూములు ఇస్తామని, చిల్లిగవ్వ చెల్లించకుండా పంటలు వేసుకోవద్దంటే ఎలా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. నోటిఫికేషన్ ఇచ్చి, అభ్యంతరాలు చెప్పేందుకు నిర్దేశిత గడువు ఇచ్చి, ధరపై సంప్రదింపుల ప్రక్రియ పూర్తి అయిందంటేనే భూసేకరణ చట్టప్రకారం సదరు భూములు ప్రభుత్వ భూములుగా పరిగణించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఆ ప్రక్రియలో భాగంగానే రైతులకు పంటలేసుకోవద్దని చెప్తున్నామని వాదిస్తున్నారు. వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం గాడిపెల్లి రెవెన్యూ పరిధిలోని గాడిపెల్లి, గుంటూరుపల్లి, నక్కలపల్లికి చెందిన 200 మంది రైతులకు సంబంధించిన 245 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరిస్తున్నది. జిల్లా యంత్రాంగానికి, రైతులకు మధ్య జరిగిన సంప్రదింపుల్లో ఎకరానికి రూ.1.20 కోట్ల ధర నిర్ణయమైంది. ఈ క్రమంలో ఈ వానకాలం నుంచి రైతులకు సంబంధించిన భూముల్లో పంటలు వేసుకోవద్దని అధికారులు ప్రకటించగా వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సర్కారు ఒప్పుకున్న ప్రకారం డబ్బులు చెల్లించకుండా పంటలు వేసుకోవద్దని చెప్పడం అన్యాయమని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఒప్పందం ప్రకారం పరిహారం చెల్లిస్తేనే భూములను వదులుకుంటామని, అటు పరిహారం ఇవ్వకుండా.. ఇటు పంటలేసుకోకుండా భూములు ఇవ్వమంటే ఎట్టిపరిస్థితుల్లో ఇచ్చేది లేదని రైతులు తెగేసి చెప్తున్నారు.

### బరాబర్ పంటలేసుకుంటం..



మాకు ఇస్తానని చెప్పిన మొత్తం డబ్బులు ఇచ్చినంకనే భూములను వదిలిపెడ్తం. అప్పటిదాకా సాగుచేసుకుంటం. నాకు 3.8 ఎకరాల భూమి ఉంది. సర్వే చేసిన తర్వాత కలెక్టర్ ఎకరానికి రూ.1.20 కోట్లు ఇస్తామన్నరు. ఇప్పటి వరకు అగ్రిమెంటు లేదు, డిపాజిట్ చేయలేదు, ఆధార్‌కార్డు, పాస్ బుక్ జిరాక్స్ కూడా తీసుకోకుండా పంటలేసుకోవద్దని ఎట్లా చెప్తరు? **- తోట రాజేంద్రప్రసాద్, రైతు, గాడిపల్లి**

### పైసలియ్యకుంట భూమి ఎట్ల ఇయ్యాలె?



పావులో పరకో ఇయ్యకుండా భూమి మీదికి రావద్దంటే ఎట్ల? పైసలియ్యంది భూమెందుకు ఇస్తం? డబ్బులు ఇచ్చిన తర్వాతనే భూములు ఖాళీ చేస్తం. పరిహారం ఇవ్వరు.. పంటలు వేయద్దంటే ఇల్లు ఎట్ల గడుస్తది ? భూములు పోతున్నమాకు ఒప్పుకున్న పరిహారం, ఇండ్ల జాగ, పిల్లలకు ఉద్యోగాలు ఇయ్యాలి. ఇప్పుడేం ఇయ్యకుండా పంటలేసుకోవద్దంటే ఎట్లా బతకాలె? **- కాయిత రేణుక, రైతు, గాడిపల్లి**

### ఏ లెక్కన పంటలెయ్యద్దు?



ప్రభుత్వం మా భూములకు పైసలిచ్చి కొన్నప్పుడే మాకు భూమి మీద హక్కు ఉండదు. ఏ లెక్కన పంటలు వేయద్దని చెప్తరు. వ్యవసాయం చేయకుండా, పరిహారం ఇయ్యకుండా మేమెట్ల బతకాలె? మాకున్న ఎకరం 20 గుంటల భూమిలో మొన్ననే బోరు వేసినం. ఆ సంబురం కూడా లేకుండా చేస్తున్నరు. **- జంగా రమ, రైతు గాడిపల్లి**